# సగటు హీరో

వాణిశ్రీ

మగవాళ్ళని చూసి సిగ్గుపడడం ఆడవాళ్ళకు సహజం. ఆడవాళ్ళని చూసి సిగ్గుపడడం అసహజం.

ఆ అసహజ సంఘటన నాకు కొంచెం ఆశ్చర్యం వేసింది.

ఎరుపు చీర, తెలుపు బ్లౌజుతో మల్లె పూలు పెట్టుకున్న మందారంలాంటి చిన్న దాన్ని చూసి సిగ్గుపడుతూ మెయిన్‌రోడ్డు మీద పోతున్నవాడల్లా ప్రక్క సందులోకి దారి తీశాడు చంద్రం.

"ఏమిట్రా బాబూ! ఎందుకు దారి మార్చావు? మనం వెళ్ళాల్సింది యిటు కాదు." అంటూనే వాడిని అనుసరించాను.

"ష్! ష్....! గట్టిగా అరవకు. గిరిజ వింటుంది" అన్నాడు గబగబా అడుగులు వేస్తూ.

"గిరిజ ఎవర్రా?"

నేను అనుమానిస్తున్నట్లే ఆ మందారాన్ని చూపించి "మా బావగారి చెల్లెలు. వరసకి మరదలు" అన్నాడు.

"ఆమెను చూసి నీకెందుకా సిగ్గు? మెడలో మూడు ముళ్ళు వెయ్యమని ప్రాణం తీస్తోందా ఏం?"

"కాదు.... కాదు."


"ఇంకేమిటి?"

"అదొక కథ!" నిట్టూరుస్తూ అన్నాడు చంద్రం.

"కామెడీయా? ట్రాజెడీయా?" నవ్వుతూ అడిగాను.

"వింటే నీకే తెలుస్తుంది." అంటూ చంద్రం సిగరెట్ వెలిగించి గుప్పుగుప్పున రైలింజనులా పొగ వదుల్తూ మూడ్‌లోకి వెళ్ళిపోయి కథ మొదలుపెట్టాడు.

ఒక రోజు నేను మా బావగారింటికి వెళ్ళేసరికి గిరిజ దిక్కుముఖం వేసుకుని ఏదో చెప్తూ వుంది. మా అక్కయ్య వంటగదిలో ఎక్కడో వున్నట్లుంది. అన్నా చెల్లెళ్ళు ఏదో చెప్పుకుంటున్నార్లే మనకెందుకు? అని నేను లోపలికి వెళ్ళబోతూ వుంటే "రావోయ్ కూర్చో" అని కేకేశాడు మా బావగారు.



గిరిజ ఉమెన్స్ కాలేజీకి వెళ్తూ వుండగా ఎవడో రోడ్డు సైడు రోమియో కొంచెం అల్లరి చేస్తున్నాడట. ఇప్పుడే వాడి ఆట కట్టించకపోతే వాడికి లోకువైపోయే ప్రమాదం వుందని అన్నగారికి చెప్తోంది.

"రేపు నేను ఆఫీసుకి సెలవు పెట్టయినా సరే వాడి సంగతేమిటో తేలుస్తాను. ఇప్పుడు కొత్తగావచ్చిన డియస్పీ నా క్లాస్‌మేట్! ఏమనుకున్నాడో వాడు! కటకటాలవెనక్కి తోయించేస్తాను. అప్పుడు గాని వాడికి బుద్ధి రాదు" అని కోపంగా చూశారు మా బావగారు.

సరే నేను వూరుకోకుండా "అంతదాకా యెందుకు బావా! వాడిసంగతి నేను చూసుకుంటానుగదా! రేపు గిరిజ కాలేజీకి వెళ్ళే సమయానికి వెంట వెళ్తాను. వాడేమైనా అల్లరి చేశాడా ముక్కలు విరగ తంతాను. మీ కెందుకు నువ్వూరుకో!" అని ఆయన్ని శాంతింపజేశాను.

మా బావగారు నా మాటమీద భరోసా వుంచి "సరే అదంతా నువ్వే చూసుకో. వాడు మళ్ళీ గిరిజను ఏమీ అనకుండా చూడాలి." అన్నాడు.

"అదంతా నాకు వదులు. ఆ రాస్కెల్ ఎవడోగాని నా దెబ్బ రుచి చూస్తాడు" అని పళ్ళు కొరికాను.

అనుకున్న ప్రకారం గిరిజ నాకంటే ముందు కాలేజీకి బయల్దేరింది. ఇరవై గజాల వెనుక ఏమీ ఎరుగనివాడిలా నేను గమనిస్తూ నడుస్తున్నాను.

కొంతదూరం పోయాక ఒక సందు మలుపులో సిగరెట్ కాలుస్తూ పొగ ఆకా

(31 వ పేజీ చూడండి)

వచ్చాయి. ఆమె రోదనకు ప్రకృతేమీ చలించక నిశ్చలంగా వుంది. చాలాసేపటి వరకూ ఆమె అలా దుఃఖిస్తూనేవుంది ఒక్కసారి చిన్నగాలి తిరిగి లేచింది ఆ గాలికి పున్నాగ చెట్టుపూలు జలజలా రాలి నేలమీద పడ్డాయి. కోసల ఆశలుకూడా రాలిపోయాయి.

విశాలమైన ఆ భవనంలో సుఖప్రదమైన జీవితం గడపటానికి కావలసిన దానికన్న హెచ్చు సామగ్రి వుంది. కాని కోసలకు అవేమీ అక్కరలేదు. అతని అనురాగం ఆమె పొందగల్గితే సకల సంపదలనూ తృణప్రాయంగా త్యజించి వుండేది.

కోసలకు జీవితమొక అంతులేని శూన్యంగా తోచింది తానొక భయంకరమైన అంధకారంలో నిలబడి వుంది. దూరాన ఒక దీపం మినుకు మినుకుమంటోంది. దాన్ని చేరుకోవాలని ఆతృత పడుతోంది. పరుగెడుతోంది. కాని ఆ దీపం అంతకంతకూ దూరమౌతోందే కాని దగ్గరవడం లేదు. ఒక్కసారిగా కోసల పెద్దపెట్టున రోదించింది. ఆమె కన్నీళ్ళు కణతలమీదుగా జారి ఆమె కేశాలను తడిపి ముద్దగా చేశాయి.

మెల్లగా తన గదిలోకి నడిచింది. తీగ తెగిన వీణ అక్కడ కనిపించింది. ఆ తెగిన వీణకు ప్రత్యామ్నాయంగా ఆమె దాని ప్రక్కన నిర్నిమేష దృష్టితో నిష్క్రియగా కూర్చుండిపోయింది. ●

## సగటు హీరో

(26వ పేజీ తరువాయి)

శంలోకి వదుల్తూ పెద్ద ఫోజులో వున్నాడు వాడు. గిరిజను ఏమన్నాడో నాకు సరిగ్గా వినిపించలేదు. కాని గిరిజ వాడిని 'రాస్కెల్' అనీ 'మేనర్‌లెస్ బ్రూట్' అనీ తిడుతోంది. వాడు అవన్నీ దీవెనలుగా భావించి నవ్వుతున్నాడు.

నేను వాడి చొక్కా కాలరు పట్టుకుని పైకి ఎగరేసి ఆకాశంలోకి విసురుతాననీ. చేతులూ, కాళ్ళూ విరగ్గొట్టి సైడు కాలువలోకి విసురుతాననీ గిరిజ ఎదురు చూస్తూ కొంతసేపు నిల్చుంది. నేను మాటా పలుకూ లేకుండా బొమ్మలా చూస్తూ నిల్చుండేసరికి కోపంతో విసవిసలాడుతూ వెళ్ళిపోయింది.

"ఏం ఎందుకని? నువ్వు వాడిని తన్నలేనంత బలంగా వున్నాడా?" ప్రశ్నించాను.

"ఎంత బలంగా వున్నా ఆడపిల్లని గొడవ చేసినవాడిని తంతే నలుగురూ పోగై మనకి సపోర్టు చేస్తారు. వాడిని తన్నడం సులభమే."

"మరెందుకు తన్నలేదు నువ్వు? ఆడపిల్లముందు పిరికివాడిలా నిల్చుండిపోయావెందుకు?" అన్నాను.

"ఏం చెయ్యన్రా! వాడు మన బాస్ కొడుకు" అన్నాడు చంద్రం.

నేను వులిక్కిపడ్డాను. "ఏమిటి?"

"అవున్రా బాబూ! వాడు మన బాస్ కొడుకే. వాడిని గొప్పకోసం తంతే వాడు వాళ్ళ నాన్నకి చెప్పి ఉద్యోగం పీకించేస్తాడు. బంగారం లాంటి ఉద్యోగంపోతే ఎలారా?" అన్నాడు చంద్రం

నేను తల వూపాను నిజమే అన్నట్లు.

"ఆ రోజు నుంచి గిరిజ ఎదుటపడాలంటే సిగ్గుగా వుందిరా! తప్పించుకుని తిరుగుతున్నాను" అన్నాడు చంద్రం.

పాపం వాడి ముఖం చూస్తే జాలేసింది నాకు. ●



దాసరి నారాయణరావు

పిల్లలను పెంచడం పెద్దవాళ్ళబాధ్యత
పెరిగాక పెద్దవాళ్ళను చూడ్డం పిల్లల బాధ్యత
ఏది ఎవరు విస్మరించినా సృష్టిధర్మాన్ని అతిక్రమించినట్లే



జి.కామరాజు సమర్పించు
ఉమాఫిలిమ్స్ కంబైన్స్

సంగీత

ఈస్ట్‌మన్ కలర్

నిర్మాత: హరగోపాల్
సంగీతం: యస్.పి.బాలసుబ్రహ్మణ్యం
కెమెరా: కె.యస్.మణి

DWARAKA